ఓంశ్రీసాయిరాం.

కాలము అనాది, కాని జీవితము క్షణికము. ప్రపంచము విశాలము, కాని, అందలి మానవుని కథనము స్వల్పము. అయినప్పటికీ, ప్రతి ఒక్కరూ వారివారి బుద్ధి విచక్షణాజ్ఞానమును ప్రయోగించి సంకుచిత దృక్పథప్రభావ ఫలితమునుండి వారు తప్పించుకొనుటకు కృషి సలుపవలెను. ఇది కేవలము నామస్మరణ వల్లనే సాధ్యమగును. ప్రతి ఒక్కరూ వారి హృదయమును నామామృత మాధుర్యముతో నింపవలెను. సర్వ సమానత్వమును, సహనమును పెంపొందించవలెను. అప్పుడే ఇతరులకు మీరు సేవజేయగలరు. దానికి క్రమముగా సాధన చేసిన కృతకృత్యులు కాగలరు.

రత్నములను కోయవలయుననిన రత్నముతోనే అది సాధ్యము. ముల్లు తీయవలయుననిన ముల్లుతోనే సాధ్యము. దుఃఖమునకునూ, పాపమునకునూ, జన్మమునకునూ మూలకారణమైన కర్మలనుండి నివృత్తి పొందవలయుననిన కర్మములనే ఆశ్రయించ వలెను. ఒకే కర్మము పలువిధములైన ఫలితములను అందించును. సూర్యోదయము కాగానే కమలములు వికసించును. అయితే, అదే సమయమున కలువలు మూసుకొనును. సూర్యాస్తమయము కాగానే గృహస్థులూ, సజ్జనులూ స్వస్థానాన్ని చేరుదురు. అయితే, దొంగలు తమ దుష్టకృత్యమునకు సిద్ధమగుదురు. ఒకే హస్తము మృదంగముపై ఆడితే శ్రవణానందము నిచ్చును. కాళీ డబ్బాపై ఆడితే దుశ్శబ్దములవల్ల చెవినొప్పి తెప్పించును. కర్మయే ఉద్ధరించును. కర్మయే అధోగతికి కూడ తెచ్చును.

శివుని కౌగలించుకొనిన మార్కండేయునివలె సుఖమును పొందవచ్చును. శవమును కౌగలించుకొనిన దుఃఖమే ప్రాప్తించును. దేహభ్రాంతియే శవమందురు. ఆత్మభ్రాంతియే శివమందురు. కాబట్టి, మీకు ఆనందమూ శాశ్వతసుఖమూ కావలయుననిన ఆత్మతత్త్వానికి అంటగట్టుకొని శివమును అనుభవించండి. దీనికి అనుకూల వాతావరణము యేమనిన, భక్తి ఒక్కటే. స్మరణే తరుణోపాయము.

నామమునకంత శక్తి వున్నది. ఎవరైన మాలిన్య పదార్థపు పేరు ఉచ్చరించిన కడుపు తిప్పటము ప్రారంభమౌను. ఎవరైన ఒక పుల్ల పదార్థపు పేరు పలికిన నాలుక నీరూరును. తుచ్ఛమైన వీటి నామములకే యింత ప్రభావముంటే ఇక పరమాత్ముని నామములు ఎంత మార్పు చేయించునని యోచించండి. అయితే, 'సతతం యోగినః' సర్వదా సర్వకాలేషు యోగులై ఆ నామమును స్మరింపవలయును. యోగులు అంటే యోగములో నిష్ణాతులు. యోగమంటే చిత్తవృత్తి నిరోధమని పతంజలి మహర్షి స్పష్టముగా చెప్పియున్నాడు. కాబట్టి, నామముతో నామిని చేర్చటమే నిజమైన తరుణోపాయము. నిరంతరమూ భగవంతుని చింతలోనే సర్వనిత్యకృత్య కర్మలనూ, నిర్బంధ జీవితమునూ సలుపవలయును. పరమార్థ స్వరూపములో మనసును లీనము చేయవలయును. మనసును కరగించి మాధవరూపముగా మార్చవలయును.

రాయిపై మరొక రాయితో రాచిన వేడి బయలుదేరును. చెట్టుకొమ్మలు ఒకదానికొకటి నిరంతరమూ రాసుకొనిన అగ్ని పుట్టును. అయితే, ఎడబాటులేక రాయవలయును. అప్పుడే అగ్ని వెలువడును. అయితే, నామము, నామి అనే రెండు కొమ్మలూ యెడబాటులేక, చిత్తములో రాచుకొనిన జ్ఞానాగ్ని పుట్టి, విషయవాసనలనన్నింటినీ భస్మముచేసి, చిత్తశుద్ధి కలిగించి, పరమాత్ముని సాక్షాత్కారము ననుగ్రహించును. అన్ని కర్మలనూ పరమాత్మ స్మరణతో ఆయన కర్పితముగా చేయవలయును. భగవచ్చింతను ధ్యానముతో, జపముతో, మననముతో, గానముతో యేరీతినైనా చేయవచ్చును. అయితే, హృదయావేదన కూడ వుండవలయును. గ్రామఫోన్ ప్లేటు లేక టేపురికార్డు పలుకు రీతికాదు. అతని ప్రీతికోసం జీవితమేగాని, మన సుఖసంతోషాలకు కాదని దృఢం చేసుకొనవలయును. ఆశయము, మనస్సు, కర్మ మూడునూ యేకముఖముగా పరమాత్ముని పాదారవిందములకై పరుగెత్తవలయును. సాకారమును మన ఆకారములో లయము చేసుకొనవలయును. నామస్మరణ వల్ల అది సాధ్యమగును. ఐహికములో కర్మలతో పవిత్రముజేసిన అది జీవితమును సార్థక పరచును. ఆముష్మికములో అది భక్తిని అభివృద్ధిజేసి భావములను మధురమయముగా మార్చును. కైవల్యమునకు కావలసిన జ్ఞానమునుకూడ నామస్మరణ మూలముగా పొందవచ్చును.

అయితే, నామమును చేరిన చిత్తము కలుగుట చాలా కష్టము. కానీ, జ్ఞానముకన్న భక్తికే రుచి, మాధుర్యము ఎక్కువ. ఒకప్పుడు జ్ఞానదేవుడూ, శాంతిదేవుడూ అరణ్యామార్గమున ప్రయాణము చేసిరి. మార్గమధ్యమున దప్పితో బాధపడి, నీరెక్కడనూ దొరకక వెతికే సమయములో ఒక భయంకర బావి కనబడినది. సుమారు రెండువందల అడుగుల లోతు అడుగున నీళ్ళు మురికి తేరుటవల్ల కనిపించలేదు. జ్ఞానదేవుడు తన జ్ఞానసిద్ధులవల్ల పక్షిరూపమును దాల్చి తన దప్పికి ఉపశాంతిని కలిగించుకొనెను. శాంతిదేవుడు భగవంతుని నామమును స్మరించుచూ ఆవేదనతో పిలచినప్పుడు, క్రిందనుంచి నీళ్ళు పొరలి బావియంత నిండి వచ్చి, ఆయన కూర్చున్న చోటికే వచ్చినది. ఇది నామమందించిన సుధానిధి.

అజ్ఞానమువల్ల అట్టడుగులో పడిపోయిన ఆధ్యాత్మికతత్త్వాన్ని పైకి తీసే ప్రయత్నమే, నామస్మరణ. బోరింగ్‌తో నీళ్ళు పైకి వచ్చేలాగున, రాం రాం రాం అనే నామస్మరణతో ఆ తత్త్వముకూడ బుద్ధికి గోచరమయి, అనుభవమునకు అందుబాటయి, ఆనందమునిచ్చును. లాంఛనప్రాయముగా నామమును పలికితే ప్రయోజనము లేదు. నామము మనోభావముతో ఉచ్చరించ వలయును. వానరులు భావముతో రామనామము రాయడమువల్ల కొండకూడా సముద్రములో తేలినది. 'మద్భక్తాః యత్రగాయంతే

తత్ర తిష్ఠామి నారద' అని భగవంతుడే మాటిచ్చినాడు. 'భావముతో నన్ను గురించి పాడితే అక్కడ నేను ప్రతిష్ఠ అయి నిలచెదను' అన్నాడు. ఉత్సవ విగ్రహమువలె కదలించటానికి వీలులేకనే నిల్చును.

నామము పెదవులనుండి రాకూడదు. నాభినుండి భక్తిశ్రద్ధలతో, ఆవేదనతో బయలుదేరవలెను. అపుడు, భగవంతుడు కోరిన కోరికలన్నియును అందించును. హృదయపూర్వకముగా ప్రార్థన సల్పితే భగవంతుడు మీ పూజరూము వాకిలి దగ్గరే కూర్చొని మీ దాసుడుగా వేచియుండును. ముఖ్యముగా, విషయాలను కోరకుండా దేవుడు కావాలి అనే కోరవలయును. అర్జునుడు కృష్ణుని కోరినాడు. దుర్యోధనుడు సైన్యబలము కోరినాడు. తుదకు జయము అర్జునునికే లభించినది. దుర్యోధనాదులు ధృతరాష్ట్రునికి నూరుమంది పుత్రులయినప్పటికీ, వారందరూ యుద్ధభూమిలో మరణించి, ఆ ముసలాయనకు తద్దినము పెట్టేవాళ్ళుకూడా లేకపోయిరి. అయితే, భగవంతుని మాత్రమే కోరిన పాండవులు చక్కగా ఇల్లుచేరి హాయిగా రాజ్యభారమును నిర్వహించిరి.

పక్కింటిలో పెద్ద ధనరాశి వుందని తెలిపిన దొంగకు నిద్ర రాదు. దానిని వశముచేసుకొనే వరకు, ఆహారముకూడా ఆయనకు అక్కరలేదు. సర్వచింతలూ, సర్వప్రయత్నములూ దానిని దొంగిలించే కొరకై అర్పితము చేయును. రామకృష్ణపరమహంస, 'కాళీమాతా! జగదంబా! తల్లీ! జగజ్జననీ! నీవింకనూ కనుపించలేదే' అని నిద్రాహారములను మాని కంటినీరు కార్చుకొని పొరలి పొరలి యేడ్చేవాడు. భగవంతుని దొంగింలించవలయుననిన, జ్ఞానధనమును అపహరింపవలయుననిన సాధకునికి నిద్రాహారములపై ఆసక్తి వుండదు.

దేహపోషణకు ధ్యానమనియూ, మనసుయొక్క ఆరోగ్యమునకు ధ్యానమనియూ విధింపబడినవి. వట్టి ధ్యానమొక్కటిని మాత్రమే ఆశ్రయించువానిని ద్విపద పశువని నిస్సందేహముగా గుర్తింపవచ్చును. బురదలో పడిన పశువు అన్ని య్రత్నములనూ సలిపి పైకి రావటానికి ఆతుర పడుతుంది. అయితే, సంసారమనే గుంటలో పడిన మనిషి మాత్రము గట్టు చేరుదామని ప్రయత్నము చేయటమేలేదు. మనిషిని యెవరూ ఉద్ధారము చేయరు. ఎవరూ నాశనము చేయరు.

తప్పు పట్టిన యినుమును అయస్కాంతము ఆకర్షించదు. తనలో మాలిన్యముండిన భగవంతునిపై ఆవేదన పుట్టదు. భగవంతుని అసంఖ్యాక నామములలో యేదైనా సరే, మీకేది రుచించునో దానినే పెట్టుకొనవచ్చును. దానికి బీజాక్షరములు, అమృతాక్షరములు యేమీ అక్కరలేదు. వాసుదేవ, గోపాల, గోవింద, గిరిధారి, గోపీవల్లభ అన్ని పేర్లూ కృష్ణునివే. అయిననూ, మీరాకు గిరిధర గోపాల అనే పేరున హృదయాకర్షణ ఎక్కువ కలిగినది. ఎవరి బలంవంతముతో ఏ నామమునూ స్వీకరించవద్దు. తన ఇష్టములే తనకు ప్రధానం. ఒకే నామప్రచారమే జరుగవలెనని అనేవారు పరమ మూర్ఖులు. భగవన్నామములలో చిన్న గొప్ప అని లేవు. మీరే గమనించవచ్చు. నెనెప్పడూ సాయి అవతారము పేరుగాని, నా పేరుగాని పెట్టుకొమ్మని చెప్పను. అన్ని నామములూ సాయిబాబావే, నావే!

భారతదేశములో అనాదికాలమునుండి అచరించబడుచున్న సనాతన ధర్మముయొక్క గొప్పతనమే యిది. 'సర్వమత సమ్మతమైన ఆత్మతత్త్వమునే భగవంతుడు' అని బోధించును. నామరూపాతీతుడు. ఏ పేరుతో పిలచినా ఆయన పలుకుతాడు. ఏ రూపముతో ధ్యానించినా ఆయన సాక్షాత్కరిస్తాడు. భారతదేశము అన్ని దేశాలకూ ఈ జ్యోతిని అనుగ్రహించుచున్నది. అయితే, ఇప్పుడు మన గొప్పతనము మనకే తెలియని పరిస్థితి ప్రాప్తించినది. భారతీయ ధర్మప్రచారము చేతునని, ఆధ్యాత్మిక శిక్షణజరుపుదునని చెబుతూ డబ్బు డబ్బు అని భిక్షమడిగే సంస్థలు కోటి వున్నవి. సత్యసాయి సంస్థలలో ధనమునకు చోటులేదు. నాకు మీ హృయమందిరమే చాలు. వేరు మందిరమందు నాకిచ్ఛలేదు. స్వామికి మందిరం కట్టాలని మీ దగ్గరకు ఎవరైనా చందాలకోసం వచ్చిన, ఒక నయాపైసాకూడా యివ్వకండి. బుద్ధిచెప్పి వెనుకకు పంపించండి.

ధర్మమునకు ధనముకాదు ప్రధానం, భక్తి. పేరుప్రతిష్టలు కావు ఆధారం, ప్రేమ. ఆ ప్రేమను పెంచుకోండి. విశ్వస్వరూపుడు అంత సులభముగా గోచరముకాడు. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశములను దాటి ఆనందమయ కోశమునకు అంత సులభముగా ప్రవేశము దొరకునా? అవన్నీ సోపానములు. ఆనందమయమే పరమాత్మ స్వరూపము. పరమాత్ముని సాకార రూపమును మీ ఆకారములో లయముచేయాలి. ఐహికమును కర్మలతో జయించి ఆముష్మికమును భక్తితో జయించి, కైవల్యమును జ్ఞానముతో పొందవలయును.

దేహమనే ధర్మక్షేత్రములో రజోగుణము, తమోగుణములనే కౌరవాదులను సాత్విక గుణముయొక్క స్వరూపులైన పాండవులు పరమాత్ముని సారధ్యమువల్ల ఓడించి విజమును పొందిరి. అమృతత్త్వము కావలయుననిన త్యాగమొక్కటే తగు సాధన. నాదికాదనిన శాంతి, నాదనిన అశాంతి తప్పదు. లోకానుభవము కావలయును. కాని, లోకమే స్థిరమని దానికంటగట్టుకొని కూర్చొనకూడదు. అంటే, అభిమాన, మమకారాలను అభివృద్ధి చేయకూడదు. కష్టమూ, సుఖమూ భగవన్నిర్ణయములు, భగవత్ప్రసాదములు. కష్టమునకు క్రుంగక, సుఖమునకు పొంగక సదా భగవదర్పణ చిత్తముతో జీవితమును గడపవలయును. అదే భారతమాతయొక్క సనాతన సందేశము.

వచ్చే సంవత్సరం మే నెలలో బొంబాయి నగరములో జరుగబోవు 'సత్యసాయి సేవా సంస్థల ప్రథమ ప్రపంచ

సమ్మేళన'మును గురించి యిపుడు ఇందూలాల్‌షా వివరములనందించిరి. ఆ దేశం, ఈ దేశం, భారతదేశం అనేది మీయొక్క పరిపాటి. సర్వప్రదేశములూ నా దేహమే. మానవ జాతిలో యెవరెక్కడ ఆవేదనతో భగవంతుని తలంచి శాంతి కొరకు ప్రార్థింతురో వారందరూ నావారే. పరమాత్మ తత్త్వాన్ని, ఆధ్యాత్మిక సాధనక్రమాలను ప్రజలకు అందించే నిమిత్తమే ఈ సంస్థలు దేశవిదేశాలలో స్థాపింపబడినాయి. పరమాత్మునికి అన్ని దేశములవారూ సమమే. ఇపుడు, ఇంటింటికీ అశాంతి, ద్వేషాసూయలు, గ్రామగ్రామానికి ద్వేషము, ఒక రాష్ట్రానికి మరొక రాష్ట్రానికి ద్వేషము. మనిషితో మనిషి మృగముగా మెలగును. మనసుకు మనసుకు జగడములు, కలతలు. కాన, మీ ప్రథమ కర్తవ్యము ఒంటిలోనున్న, ఇంటిలో పెరిగే అగ్నిని చల్లార్చుకోటమే. దీనికి తగిన సాధనలను తెలుసుకొని ఆచరణలో పెట్టవలయును. జీవుడే దేవుడు అనే నిత్యానుభవము అనే గొప్ప ధనరాశి ఇంటిలో వుంచుకొని, ఊరంతా తిరిగి అందరి వాకిలి ముందర నిలచి భిక్షమడిగేది ఎంత అవమానము!

భారతదేశము ఆధ్యాత్మిక జ్యోతిని అన్ని దేశములకూ అందించినది, అందించుచున్నది. వేదశాస్త్రములే అన్ని ధర్మములకూ, అన్ని మతములకూ మూలము, ఆధారము. ఆ జ్యోతి అందరి హక్కు. సర్వమత సమ్మతమైన సర్వదేవతా స్వరూపుడైన పరమాత్మను తెలిసికొనే సాధనలనే సనాతన ధర్మము బోధించుచున్నది.

బొంబాయిలో సేవాసమితివారు సంకల్పించి నిర్మించుచున్న 'ధర్మక్షేత్ర భవనము' కూడ ప్రపంచ సమ్మేళనమునకు సిద్ధమగును. భారతదేశము యోగభూమి, త్యాగభూమి. దానికి తగినట్టు, భారతీయులందరూ తమ జీవిత పథమును తీర్చిదిద్ది ఆధ్యాత్మిక సంతృప్తిని పొందే నిమిత్తము పాటుపడవలయును.

(1967 నవంబరు 4వతేదీ బొంబాయిలో ధర్మక్షేత్ర శంకుస్థాపన సందర్భముగా భగవాన్ బాబావారి దివ్యోపదేశము)